నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

గురువారం | అక్టోబర్ 24, 2024 | www.navatelangana.com

కొండచిలువతో భయం.. కర్రలతో హతం..

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పర్మల్లతాండ శివారులోని పంటచేనుల్లో బుధవారం కొండచిలువ కనిపించడంతో రైతుల హతమార్చారు. తాండవాసుల వివరాల ప్రకారం.. పర్మల్ల తాండకు చెందిన రూప్‌సింగ్ తన పంట పొలంలో వరి కోస్తుండగా భారీ కొండచిలువ కనిపించింది. దీంతో గిరిజనులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే వారు కర్రలతో కొండచిలువను హతమార్చారు.



రైతులు హతమార్చిన కొండచిలువ

వెళ్లాలంటే.. నెట్టాల్సిందే..

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి నవీపేట్ మీదుగా నందిపేట్ వెళ్లాల్సిన ఓ ఆర్టీసీ బస్సు రిపేర్ కారణంగా స్టార్ట్ కాలేదు. దీంతో ఆ బస్సులోని వివిధ గ్రామాలకు వెళ్లాల్సిన వారు, విద్యార్థులు బస్సును ఇలా నెట్టారు. రెండు సార్లు ప్రయత్నించినా బస్సు స్టార్ట్ కాలేదు. మూడో ప్రయత్నంలో బస్సు స్టార్ట్ అవడంతో అందులో వెళ్లేవారు ఊపిరిపీల్చుకున్నారు.



బస్సును నెట్టుతున్న యువకులు, విద్యార్థులు

పీహెచ్‌సీలోకి పాములు

ప్రజల, వైద్యసిబ్బంది రక్షణపై పట్టింపేది..?

- జిల్లా వైద్యాధికారి మాటను సైతం పట్టించుకోని వైనం
- పగిలిన అద్దంలో నుంచి ఆస్పత్రిలోకి పాములు
- పాము కరిస్తే.. విరుగుడు మందు సైతం లేని దైన్యం



ఫార్మసీ గది కిటికీకి లేని అద్దం.. అడ్డుగా అట్టముక్క



నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండల ప్రాథమిక వైద్యశాల వెనుక వైపు కిటికీ అద్దం పగలడంతో గత నెల 20వ తేదీన నవతెలంగాణ పత్రికలో "రోగులకు భద్రత కరువు"అనే శీర్షికతో కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన జిల్లా వైద్యాధికారిణి నాలుగు రోజుల తర్వాత ఏర్గట్ల ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి కిటికీ అద్దం సరిచేయవలసిందిగా ఆదేశించారు. ఆదేశాలు ఇచ్చి దాదాపు నెలరోజులవుతున్నా.. ఇప్పటికీ కిటికీ అద్దం బిగించకపోవడం గమనార్హం. అయితే నాలుగు రోజుల క్రితం వెనుక వైపు నుండి పాము వచ్చి, ఓ మూలన చేరడంతో, గమనించిన వైద్య సిబ్బంది పాములు పట్టే అతన్ని పిలిపించినట్టు సమాచారం.

ఈ ఒక్క అద్దమే కాక వైద్యశాలకు ముందు గల ఫార్మసీ గది అద్దం కూడా పగలడంతో దానికి కూడా అట్ట ముక్క పెట్టి తమ పనిని కానిచ్చేస్తున్నారు. మందులు ఇచ్చే గదిని పరిశీలించగా.. మొత్తం గదంతా ఊపిరాడకుండా మందుల పెట్టెలతో చిందరవందరగా ఉంది. ఒకవేళ వైద్యులకు గాని, రోగులకు గాని ఏ సమయంలోనైనా పాము కాటు వేస్తే విరుగుడు మందు కూడా ఇక్కడ లేదు. దాని కోసం కమ్మర్‌పల్లి, మోర్తాడ్ లేదా ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిందే. అంతలోపు రోగి పరిస్థితి విషమిస్తే ప్రాణాపాయం తప్పదు. పగిలిన అద్దాలు అమర్చరా అని వైద్యులను, సిబ్బందిని నవతెలంగాణ అడగగా బడ్జెట్ లేదు అని నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారు. 500 వందల రూపాయల అద్దం కోసం బడ్జెట్ లేదు అని సమాధానం చెప్పడం హాస్యాస్పదంగా ఉందని స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా, మండల వైద్య యంత్రాంగం మేలుకొనకపోతే వైద్యం కోసం వచ్చే ప్రజల భద్రతకు భరోసా లేకుండా పోతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఏర్గట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

> సాధారణంగా జ్వరం, ఇతరాత్ర అనారోగ్య సమస్యలు వస్తే ఆస్పత్రికి వస్తుంటాము. కానీ ఏర్గట్ల మండల కేంద్రంలోగల పీహెచ్‌సీకి వెళ్తే.. లేని రోగం కొనితెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఆస్పత్రి కిటికీలకు అద్దాలు లేకపోవడంతో విష సర్పాలు, విష కీటకాలు అందులో నుంచి దూరి ఆస్పత్రిలోకి వస్తున్నాయి. ఇదే విషయమై నవతెలంగాణలో కథనం ప్రచురించడంతో జిల్లా వైద్యాధికారిణి సైతం వచ్చి తనిఖీ చేసి అద్దాలు మార్చాలని సూచించారు. అయినా ఇప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం. కాగా ఇటీవల ఆస్పత్రిలోకి పాము వచ్చినట్టు సమా చారం. దీంతో పాములు పట్టేవారిని పిలిపించి పాము పట్టుకెళ్లారు. ప్రమాదవశాత్తు లోపలికి వచ్చిన పాము ఎవరినైనా కాటువేస్తే.. సదరు పీహె చ్‌సీలో విరుగుడు మందు సైతం లేదు. అక్కడి నుంచి కమ్మర్‌పల్లి, మోర్తాడ్ లేదా ఆర్మూర్‌కు పరుగు తీయాల్సిందే.

ప్రజలపై పన్నుల భారం

- దేశ సంపదను ధనవంతులకు దోచిపెడుతుతున్న కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు
- బోధన్ ఏరియా 2వ మహాసభ



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-బోధన్

కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజలపై అనేక విధాలుగా పన్నుల భారం వేస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని.. అదే తరహాలో సామాన్యుడి ఆదాయం మాత్రం పెరగడం లేదని అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఓటర్‌కర్ సాయిలు ప్రాంగణం (పీఆర్టీయూ భవన్)లో సీపీఐ(ఎం) పార్టీ 2వ ఏరియా మహాసభను నిర్వహించారు. ముందుగా సీనియర్ నేత కామ్రేడ్ గంగాధరప్ప జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఓటర్ కర్ సాయిలు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను ధనవంతులకు దోచిపెడుతుందని అన్నారు. వారికి బిజెపి సర్కార్ పూర్తిగా సహకారం అందిస్తుందని అన్నారు. ఒకవైపు దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరుగుతుందని, దీనిని పరిష్కరించకుండా ఇంకా ప్రజలను మభ్య పెట్టడానికి కులమతాల పేరుతో ప్రజల మధ్య వైశమ్యాలను సృష్టిస్తుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఇంకా అమలు చేయలేకపోవడం సరికాదని అన్నారు. ప్రభుత్వం హామీలను నిలబెట్టుకుంటుందని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. మిగిలిపోయిన రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.2500 ప్రతి కుటుంబానికి వెంటనే ఇవ్వాలని అన్నారు. అలాగే బోధన్ ప్రాంతంలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీని కాంగ్రెస్ ప్రభుత్వం ఆధీనంలో నడిపించాలని, నిజాంషుగర్ ఫ్యాక్టరీ వల్ల బోధన డివిజన్‌లోని ప్రజలకు ఆర్థిక చేయూత లభిస్తుందని అన్నారు. అలాగే రైతులకు ఈ ప్రాంతంలోని వ్యాపారులకు అలాగే నిరుద్యోగులకు ఆర్థిక భరోసా కలుగుతుందని అన్నారు. కావున రేవంత్‌రెడ్డి సర్కార్ ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిజాంషుగర్ పనులను ప్రారంభించాలని కోరారు. అనంతరం బోధన్ ఏరియా కార్యదర్శిగా కామ్రేడ్ జంబిశెట్టి శంకర్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. నాయకులు ఏషాల గంగాధర్, ఎస్.కుమారస్వామి, కుప్రియాల బాలయ్య, జంగం గంగాధర్, వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, గోవింద్‌సాగర్, ఎం.గంగారం తదితరులు పాల్గొన్నారు.

ఒక్క గింజా కొనుగోలు చేయలే

- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. రైసుమిల్లులు కేటాయించని ప్రభుత్వం

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్రంలో మొదటగా వరి పంటలు చేతికొచ్చే ప్రాంతం బాన్సువాడ నియోజకవర్గం. ఈ ప్రాంతంలోని వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాల్లో కొన్నిరోజుల క్రితమే పంట చేతికొస్తుంది. అయితే ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. ధాన్యం కొనుగోళ్లు మాత్రం చేపట్టడం లేదు. ఇప్పటికి రైతుల నుంచి ఒక్క వరి గింజ కూడా కొనుగోలు చేయకపోవటంతో రైతులు కొనుగోలు కేంద్రాల వైపు చూస్తున్నారు. ప్రజాప్రతినిధులు మాత్రం కొనుగోలు కేంద్రాలు ఆర్భాటంగా ప్రారంభిస్తున్నా.. కొనుగోళ్లు చేయకపోవటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలుపై క్లారిటీ లేదు..

ప్రభుత్వం నుంచి కొనుగోళ్లుపై ఇంకా సహకార సంఘాలకు క్లారిటీ లేదని, రైస్ మిల్లులను కూడా అలర్ట్‌మెంట్ చేయలేదని సొసైటీలు చెబుతున్నాయి. దీంతో తమకు దిగుబడి తగ్గి నష్టం అవుతుందని, కూలీలకు కూలి చెల్లించకపోతామని సొసైటీ చైర్మెన్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రైసుమిల్లులను కేటాయించి ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 37 తులాల బంగారం ఆభరణాలు, నగదు అపహరణ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. 37 తులాల బంగారు ఆభరణాలు, నగదును అపహరించినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని పీఎంహెచ్ కాలనీలో నివసించే అర్నె యోగేష్ అనే వ్యక్తి అతని కుటుంబంతో సహా ఈ నెల 21న ఉదయం 9:30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి వరంగల్ వెళ్లారు. 22న సాయంత్రం 6:30 గంటలకు వారికి తెలిసిన బంధువుల ద్వారా, వారింటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం ఇవ్వడంతో వారు రాత్రికి ఇంటికి వచ్చి చూసేసరికి, ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న దాదాపు 37 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు ను దొంగిలించుకుపోయారని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని కామారెడ్డి ఎస్డిపిఓ నాగేశ్వరరావు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిసిఎస్ సిబ్బంది, కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది పరిశీలించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ టీవీ కెమెరాలను పరిశీలించారు. పాత నేరస్తుల గురించి మూడు బృందాలుగా విడిపోయి నేరస్తుడిని పట్టుకునే పనిలో పోలీసులు ఉన్నారు.



చోరీకి గురైన బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

29న బీసీ కమిషన్ బృందం రాక

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రంలో చేపట్టబోయే కుల గణనపై ఆయా పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు వీలుగా ఏర్పాటైన తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం ఈ నెల 29న నిజామాబాద్‌కు రానున్నట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కులాల స్థితిగతులపై కమిషన్ బృందానికి ప్రజలు, వివిధ సంఘాల వారు, రాజకీయ పార్టీల బాధ్యులు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చని కలెక్టర్ సూచించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని రాంపూర్ డి గ్రామంలో వివిధ కారణాలతో ఆకస్మికంగా మృతి చెందిన వారి బాధిత కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని బుధవారం మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలతో కలిసి పరామర్శించారు. ఎల్లవేళలా బీఆర్ఎస్ పార్టీ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. వారి వెంట మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీ ఉప సర్పంచ్ ఎంకనోల్ల రమేష్, డైరెక్టర్ రాజ్ కుమార్, రవితో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాలలో బస్సు సౌకర్యం కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

గిరిరాజ్ కళాశాలలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిజి కళాశాల యూనిట్ సెక్రటరీ చక్రి మాట్లాడుతూ.. గతంలో జిజి కళాశాలకు బస్సు సౌకర్యం ఉండేదని సంవత్సర కాలం నుంచి బస్సులను పునరుద్ధరణ చేయలేదని అన్నారు. వెంటనే రవాణా సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాజకీయ నాయకులు జి జి కాలేజ్‌ను అనేక సమావేశాలకు వాడుకున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. జిజి కళాశాల సమయానికి అనుగుణంగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వరకు బస్సులను నడపాలని, బస్సులు నడపకపోవడం వల్ల విద్యార్థులు అధిక ఆటో చార్జీల రీత్యా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జిజి కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జి.జి కళాశాలను కాంగ్రెస్ ప్రభుత్వం 100 కోట్లతో అభివృద్ధి చేయాలని, సకాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దినేష్, సుజిత్, తదితరులు పాల్గొన్నారు.



సంతకాలను సేకరిస్తున్న పోలీసులు

ఇండియన్ రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా చేర్పించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఇండియన్ రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా ఎక్కువ మొత్తంలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. రెడ్‌క్రాస్ ద్వారా సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. అంతకుముందు గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు రాజన్న, చీఫ్ ప్లానింగ్ అధికారి రాజారాం, జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యవేక్షణలో సిహెచ్ఒ ఉద్యోగాల అభ్యర్థులకు కౌన్సిలింగ్..

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో బుధవారం మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎం.హెచ్.ఎల్.పి), సి.హెచ్.ఓ ఉద్యోగాల కోసం నియామకాల ప్రక్రియ నిర్వహించారు. 24 పోస్టులకు గానూ మొత్తం 184 దరఖాస్తులు రాగా రోస్టర్ కమ్ మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేసిన 24 మంది అభ్యర్థులను ఎంపిక ప్రక్రియ కోసం హాజరు కావాలని సమాచారం ఇవ్వగా 11 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ చాంబర్‌లో పోస్టింగ్ ప్రదేశం కోసం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యవేక్షణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎంపికైన అభ్యర్థులు అందరికీ కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చంద్ర శేఖర్, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

దీపావళి వేళ.. పటాసులతో పైలం

- జనావాసాల్లో టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనుమతుల్లేవ్
- అతిక్రమిస్తే దుకాణాలను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం
- నవతెలంగాణతో ఫైర్‌స్టేషన్ అధికారి అధికారి నర్సింగ్ రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దీపావళి పండుగ వేళ.. పటాసులతో జాగ్రత్తలు పాటించాలని ఫైర్‌స్టేషన్ అధికారి అధికారి నర్సింగ్‌రావు సూచించారు. దీపాలు వెలిగించే సమయంలో, టపాసులు పేల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు నివారించే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా జనవాసాల్లో టపాసుల విక్రయాలకు అనుమతి లేదని, అతిక్రమిస్తే దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గంజ్ ప్రాంతంతో పాటు మరెక్కడా సైతం టపాసుల విక్రయాలకు అనుమతి లేదని తెలిపారు. దీపావళి పండుగ వేళ.. నవతెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు ఆయన మాటల్లో..

జనావాసాల్లో, రద్దీ ప్రదేశాల్లో విక్రయించొద్దు

దీపావళి పండుగ నేపథ్యంలో జనావాసాల్లో, రద్దీ ప్రదేశాల్లో టపాసులు విక్రయించొద్దు. అనుమతి ఉన్న చోటలనే విక్రయాలు జరపాలి. ప్రస్తుతం నగరంలో ఎక్కడా విక్రయాలకు అనుమతులు లేవు. కేవలం బైపాస్ రోడ్డులోనే మూడు షాపులకు అనుమతులు ఉన్నాయి. వారు అక్కడే విక్రయించుకోవాలి. ఆ లైసెన్స్ పేరుతో ఇతర ప్రాంతాల్లో, జనావాసాల్లో విక్రయాలు చేపట్టొద్దు. గంజ్‌లో దుకాణాలపై గతంలో కేసు నమోదు అయింది. అయితే వారు కోర్టును ఆశ్రయించడంతో ఆ కేసు కోర్టులో నడుస్తుంది.

అనుమతులు ఉన్న వారు నిబంధనలు పాటించాలి

కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు ప్రాంతంలో మినహా.. ప్రస్తుతం నగరంలో ఎక్కడా కూడా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు లేవు. పోలీస్, మున్సిపల్‌తో పాటు ఫైర్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్న తర్వాతే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. టపాసుల విక్రయ దుకాణా లు ఏర్పాటు చేసిన వారు ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. దుకాణ సముదాయం వద్ద 2 నుంచి మూడు డ్రమ్ముల నీరుతో పాటు రెండు బకెట్లు అందుబాటులో ఉంచాలి. రెండు బకెట్ల పొడి ఇసుక ను ఏర్పాటు చేసుకోవాలి.

అగ్నిని ఆర్పే సాధనాలు అందుబాటులో ఉంచుకోవాలి. అనుకోని ఘటనలు ఎదురై మంటలు అంటుకుంటే వాటిని ఆర్పేందుకు ఫైర్ ఇంజిన్ వచ్చి వెళ్లేలా దారి ఏర్పాటై ఉండాలి. ఎంట్రీ, ఎగ్జిట్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి. ఐఎస్ఐ మార్కుఉన్న విద్యుత్ ఉపకరణాలను వాడాలి. లూస్ వైరింగ్ లేకుండా చూసుకోవాలి. అగ్నిప్రమాదం జరిగినప్పుడు వెంటనే 101కి, లోకల్ ఫైర్ స్టేషన్ నెంబర్ కి కాల్ చేయాలి. ఒకవేళ షాప్ వద్ద గాని, దగ్గరగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటి వి స్టోర్ చేయకూడదు. దగ్గరగా బాణా సంచా పేల్చరాదు, నిల్వ చేయరాదు.



ప్రజలు జాగ్రత్తలు పాటించండి

దీపాలు వెలిగించే క్రమంలో, టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. సిల్క్, నైలాన్ దుస్తులు కాకుండా కాటన్ దుస్తులు ధరించండి. అప్రమత్తంగా ఉండకపోతే అగ్ని ప్రమాదాలు సంభవించవచ్చు. పిల్లలను టపాకాయలు కాల్చేందుక దూరంగా ఉంచండి. టపాసులు పేల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పర్యావరణ అనుకూల టపాసులు ప్రస్తుతం అందు బాటులోకి వస్తున్నాయి. వాటిని వినియోగించి పర్యావరణాన్ని రక్షించండి.

ప్రమాదం చోటుచేసుకుంటే ఫోన్ చేయండి

ఏదైనా అనుకొని అగ్ని ప్రమాద ఘటన చోటుచేసుకుంటే జిల్లాలోని ఫైర్ స్టేషన్ నెంబర్‌కు ఫోన్ చేయండి. 101తో పాటు ఈ నెంబర్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి. నిజామాబాద్ ఫైర్ స్టేషన్ 8712699224, 8712699225, నిజామాబాద్ రూరల్ ఫైర్ స్టేషన్ 8712699230, 8712699231, ఆర్మూర్ ఫైర్ స్టేషన్ 8712699228, 8712699229, భీమ్ గల్ ఫైర్ స్టేషన్ 8712699232, 8712699233, బాల్కొండ ఫైర్ స్టేషన్ 8712685797, 8712685798, నందిపేట్ స్టేషన్ ఫైర్ స్టేషన్ 8712685799, 8712685800, బోధన్ ఫైర్ స్టేషన్ 8712699226, 8712699227, జిల్లా ఫైర్ ఆఫీసర్ నిజామాబాద్ 8712699141, కంట్రోల్ రూం హైదరాబాద్ 8712699444, 8712699464 నంబర్‌లకు ఫోన్ చేయవచ్చని తెలియజేశారు.



పశువులకు గాలికుంటు టీకాలు

నవతెలంగాణ-మెండోర/మాక్లూర్

పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దూదిగం గ్రామంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలోని 250 పశువులకు (ఆవులు మరియు గేదెలు) ఉచిత గాలికుంటు టీకాలు వేశారు. పశువులకు గాలి కుంటు వ్యాధులు రాకుండా రైతులు పాడి పశువులకు ఒక్కరు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు డాక్టర్ గౌతమ్ రాజు, పశువైద్య అధికారి గ్రామస్తులు కుంట.నర్సయ్య గైన్ల శ్రీనివాస్; సమరేందర్, కూడాల గంగాధర్, పశువైద్య సిబ్బంది ప్రణీత్, మల్లేష్ పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని బొర్గం, గాలిబ్ నగర్, గద్వాల్ క్యాంప్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశు వైద్య పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం వేశారు. ఈ సందర్భంగా సుమారు 476 పశువులను టీకాలు వేయించారు. కార్యక్రమంలో మండల పశు వైద్య అధికారిని డాక్టర్ ఉమామాసహెర్, ఇవి ఎల్ ఓ వినిత, జే వి ఓ కల్యాణి, విఏ పాశా, గంగధర్, ఓఎస్ పుష్ప, హెచ్ఏ మహెశ్వరి, గోపాలమిత్ర సుధీర్ పాల్గొన్నారు.

మాధవ్‌నగర్ రైల్వే గేట్ మూడు రోజులపాటు మూసివేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలం లోని బర్ధిపూర్ శివారులోని మాధవనగర్ రైల్వే గేటును మూడు రోజుల పాటు మూసివేయనున్నారు. ఈ నెల 25న రాత్రి 12 గంటల నుండి 27 రాత్రి 11 గంటల వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. మరమ్మతుల కారణంగా గేటును మూసివేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రయాణికులు బైపాస్ రోడ్డు మీదుగా నిజామాబాద్‌కు రాకపోకలు సాగించాలని అధికారులు సూచించారు.



మూసి ఉన్న మాధవనగర్ రైల్వే గేట్

పట్టణ ఏఎంసీ డైరెక్టర్‌గా మామిడి శేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమించింది. పెర్కిట్, కోటర్మూర్ కీ చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిడి శేఖర్‌రెడ్డి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. చైర్మన్‌గా పట్టణానికి చెందిన సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్‌గా ఇస్సపల్లి గ్రామానికి చెందిన విట్టల్ జీవన్, పదిమంది పాలకవర్గ సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మామిడి శేఖర్‌రెడ్డికి వినాయక రెడ్డి, వాసులు, పెర్కిట్ కోటర్మూర్ గ్రామ ప్రజల తరుపున కార్యకర్తల తరుపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

రెండవ వార్డులో కుక్కల పట్టివేత

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో కుక్కల బెడద అధికంగా ఉండని మున్సిపల్ కౌన్సిలర్ సంగీతా ఖాందేష్ మున్సిపల్ అధికారులకు విన్నవించగా బుధవారం కుక్కలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సంగీతా ఖాందేష్ మాట్లాడుతూ ప్రజలు వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వీధి కుక్కలతో పాటు కోతులు, పందుల విషయంలో తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానాకుర్దు (తాడేం) మాజీ సర్పంచ్ కుచన్ పల్లి జలంధర్ రెడ్డి జిల్లా కేంద్రంలోని గోనెరెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహించిన గ్రంథాలయ చైర్మన్ సన్మాన సభలో ఆయనను శాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేసిన రాజారెడ్డికి పదవి వరించడం ఎంతో సంతోషకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్టీకి సేవచేసిన నాయకులకు పదవులు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతిఒక్కరికీ పదవులు వస్తాయని ఆయన తెలిపారు.

అమరవీరుల వారోత్సవాలను విజయవంతం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

నవంబర్ 1 నుండి30 వరకు అమర వీరుల వారోత్సవాలను నిర్వహించాలని సిపిఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపునిచ్చారు. భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి, సమాజం నిర్మాణం కోసం తమ ప్రాణాలను ప్రాయంగా అర్పించిన అమర వీరుల వారోత్సవాలను దేశ వ్యాప్తంగా నిర్వహించాలని ఆయన పిలుపు నిచ్చారు. దళిత, ఆదివాసీ, మనువాద, కార్పొరేట్ రాజకీయాలతో పెనవేసుకుపోయిన నేటి పరిస్థితిలో పేదవారు తనకున్న రాజ్యాంగ బద్ధంగా కల్పించిన హక్కులను సైతం రాజ్యం నిరాకరిస్తూ, హక్కుల కోసం పోరాడే వారిని దేశ ద్రోహులుగా ముద్రవేస్తు వారిని జైలో వేస్తున్నారన్నారు. జల్,జంగల్,జమీన్, ఇజ్జత్ పోరాట లు చేస్తున్న ఆదివాసీలను మావోయిస్టులుగా ముద్రవేస్తు ఆరుమాసాల్లోనే వెయ్యి మందికి పైగా బూటకపు ఎన్కౌంటర్‌తో చట్టుకున్న బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలో కాంగ్రెస్,ఆంధ్రలో చంద్రబాబు ప్రభుత్వాలు కేంద్రానికి సహకరిస్తూ ప్రజా ఉద్యమాలను అణిచి వేస్తున్నారని అన్నారు. అడవిలో ఉన్న అపారమైన ఖనిజ సంపద దోపిడీని వ్యతిరేకిస్తు ఆదివాసీలదే పూర్తి హక్కుగా డిమాండ్ చేస్తూ రాజ్య హింసకు వ్యతిరేకంగా విప్లవ ఐక్య ఉద్యమాలకు కల్సి ఉద్యమాలను చేపట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. జీవాల గడ్చిరోలి నారాయణపూర్‌లో జరిగిన బూటకపు ఎన్కౌంట రను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆరునెలల కాలంలో జరిగిన అన్ని ఎన్కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి బూటకపు ఎన్కౌంటర్‌కు కారణమైన పోలీసులపై హత్య నేరం నమోదు చేసి తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అమర వీరుల వారోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర స్పందన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబాబు, మహిళా సంఘం నాయకులు సంపంగి లక్ష్మి, పెద్దలు, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతివిద్యార్థి కళాశాలకు హాజరయ్యేలా చూడాలి

- డిఐఈఓ రవికుమార్



మాట్లాడుతున్న డిఐఈఓ రవికుమార్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ మధు బాలిక జూనియర్ కళాశాలలో నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో విద్యార్థుల హాజరు తీరును పరిశీలించి ప్రతి విద్యార్థి కళాశాలకు హాజరయ్యేట్లుగా చూడాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. రానున్న అర్థ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేస్తూ సిలబస్ పూర్తి చేయాలని అన్నారు. ప్రయోగశాలను పరిశీలించి వెంటనే ప్రయోగాలను ప్రారంభించాలని ఆదేశించారు. అడ్మిషన్ ప్రక్రియ పూర్తయినందున ఆ పనిని త్వరగా పూర్తి చేయాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. కళాశాలలో మంచి వాతావరణం నెలకొల్పే విధంగా మొక్కలను పెంచాలని అన్నారు. అలాగే క్రమం తప్పకుండా కళాశాలలో విద్యార్థుల ప్రతిభలో వెనుకబడిన వారిని మెరుగుపరిచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఆదేశించారు.

బాలుడి గుండె ఆపరేషన్ కోసం ఆర్థిక సహాయం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన ఎస్.కె.మోషీ కుమారుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి బాలుడి వైద్య ఖర్చుల కోసం 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పంపారు. స్థానిక నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెంజ రాజారెడ్డి, నాయకులు కల్లెడ పురుషోత్తం, దండెవోయిన సాయి కుమార్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు పాటుపడితేనే
సహకార సంఘాల లక్ష్యం నెరవేరినట్టు

- అవగాహన సదస్సులో వక్తలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైతు శ్రేయస్సు కోసం పాటిపడినప్పుడే సహకార సంఘాల లక్ష్యం నెరవేరినట్టు అని అవగాహన సదస్సులో వక్తలు తెలిపారు. నిజామాబాద్ జిల్లా డిసిసిబి ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిఏసిఎస్ అధ్యక్షులు, కార్యదర్శులకు ఒక రోజు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోధన్ ఎంఎల్ఏ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాలు అభివృద్ధి చెందాలంటే అధికారులకు పాలకవర్గాలకు మధ్య సంబంధం దగ్గరగా ఉండాలని, అందరూ కలిసి పనిచేసే సంస్థను అభివృద్ధి వైపు తీసుకుపోవాలని అన్నారు. సహకార సంఘాలు అంటే కేవలం వరి కొనుగోలు చేసే ఎరువులు అమ్మడం మాత్రమే కాదని అన్నారు. సహకార సంఘాల్లో ప్రభుత్వ కాకుండా కమర్షియల్ వ్యాపారాలు చేసే సంస్థల యొక్క భవిష్యత్తును బలంగా చేయాలని ఆయన అన్నారు. ఆదేవిధంగా రైతులకు ముఖ్యమైన సూచనలు ఎలాంటి విత్తనాలు వాడాలి.. ఎంత మోతాదు ఎరువు లేదా పురుగుమందు వాడాలి. పంటల్లో వచ్చిన రోగాలకు సంబంధించిన నివారణ చర్యలను కూడా శాస్త్రవేత్తలు అధికారులు రైతులకు తెలుపాల్సిన బాధ్యత వారి పైన ఉందని అన్నారు. పంటల్లో వరి మాత్రమే కాకుండా చెరుకు వంటివి కూడా సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని ఆయన అన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో ప్రతి సొసైటీలో బాధ్యతగా వ్యవహరించాలని, 17 పర్సెంట్ తేమ శాతం వచ్చిన వడ్లను తీసుకోవాలని తెలిపారు. తడిగా ఉన్న ధాన్యాన్ని వాతావరణాన్ని బట్టి ఒకరోజు ఎండబెట్టి తీసుకోవాలని రైతులకు కూడా వాతావరణానికి అనుగుణంగా పంట పొలాలు కోతలు నిర్వహించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం త్వరలోనే కొనుగోలు మొదలు పెడుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ గోదాములు అన్ని నిండిపోయాయని, ఇప్పుడు కొనుగోలు చేసిన వడ్లను నిలువ చేయడానికి గోదాంలు సమకూర్చిన తర్వాత ప్రభుత్వ వడ్ల కొనుగోలు చేస్తుందని తెలిపారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని త్వరలోనే తెరిపిస్తామని, దాదాపు 200 కోట్ల వరకు బకాయిలను చెల్లించడం జరిగిందని, రైతులు చెరుకు వైపు కూడా మొగ్గు చూపాలని, చెరుకులో ఏ రకమైన విత్తనం వేస్తే ఏ విధంగా వస్తుందో శాస్త్రవేత్తలు వారికి సూచనలు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాలు అభివృద్ధి జరగాలంటే కేవలం వరి కొనుగోలు మాత్రమే కాకుండా ఇతర వ్యాపారాలు కూడా చేయాలని, చేపల పెంపకం, కోళ్ల పెంపకం, పూల విక్రయం, పాలవిక్రయం వంటి వాటిలో సొసైటీలు పాల్గొని కొనుగోలు విక్రయాలు చేస్తే సొసైటీలకు లాభదాయకంగా ఉంటుందని ఆయన అన్నారు. రైతుల నుండి వ్యాపారాలు పాలు కొనుగోలు చేసి అధిక శాతం నీళ్లు కలిపి ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. రైతుల నుండి సొసైటీలు పాలు సేకరించి ప్రజలకు అందించడం ద్వారా సొసైటీలకు కూడా లాభంగా ఉంటుందని అన్నారు. చేపలు పెంచడంలో గాని కోళ్ల పెంచడంలో గాని సొసైటీలు తమ వంతుగా వరి కొనుగోలు చేసిన విధంగా వాటిని కూడా కొనుగోలు చేసి సప్లయర్‌గా ఉండడం ద్వారా సొసైటీలకు లాభాలు చేకూరుతాయని, తద్వారా సొసైటీలు బాగుపడతాయని, భవిష్యత్తులో కూడా ఇబ్బందులు రాకుండా ఉంటాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం కావాలన్నా ముందుండి సహకరిస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సంస్థలు అభివృద్ధి చెందాలంటే అధికారులకు పాలకవర్గాలకు మధ్య సంబంధాలు దగ్గరగా ఉండాలని, ఎక్కడో జరిగే కొన్ని చిన్న చిన్న తప్పుల వల్ల సహకార సంఘాల విలువలు తగ్గిపోతున్నాయని, కానీ నిజానికి సహకార రంగాల పాత్ర ఎంతో కీలకమైనదని ఆయన అన్నారు. సహకార సంఘాలు ఆర్థికంగా బలంగా కావాలంటే కేవలం వరి కొనుగోళ్లపై ఆధార పడకుండా ఇతర వ్యాపారాలు చేసి సంస్థను లాభాదాయకంగా చేయొచ్చని తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్లు ప్రతి సొసైటీలో ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తూనే సంస్థకు ఆర్థిక లాభం సమకూర్చే ప్రయత్నాలు చేయడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగా నవంబర్ 30న హైదరాబాద్, వరంగల్ శిక్షణ కేంద్రాల్లో సొసైటీ కంప్యూటర్ ఆపరేటర్లకు కామన్ సర్వీసింగ్ సెంటర్ పై ట్రైనింగ్ నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు. దీనికి ప్రతి సొసైటీ నుండి కంప్యూటర్ ఆపరేటర్లను ఆయా సొసైటీ అధ్యక్షులు విధిగా పంపించాలని అన్నారు. అందరం కలిసి సహకార రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళ్దామని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. సీఎస్‌సీ ద్వారా సేవలు అందించడం ద్వారా సొసైటీలు ఆర్థికంగా లబపడటమే కాకుండా సొసైటీ పరిధిలోని వారికి సేవలు అందించే విధంగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ తార చంద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మార గంగారెడ్డి, వ్యవసాయ కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఎండి అన్నపూర్ణమ్మ డిసిసిబి డైరెక్టర్లు, డిసిఎంఎస్ డైరెక్టర్లు, వివిధ సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కెనాల్, చెరువు కాలువలను సర్వే చేయాలి

- ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్

నవతెలంగాణ-మాక్లూర్

కబ్జాకు గురైన నిజాంసాగర్ కెనాల్ కాల్వను మాణిక్ బండార్ చెరువు కాలువలను సర్వే చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్ డిమాండ్ చేశారు. మండలంలోని మాణిక్ బండార్ వద్ద బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని దాస్ నగర్ నుండి మాణిక్ బండార్ సుజిత్ ఫ్యాక్టరీ వాగు వరకు కబ్జా గురైన నిజాంసాగర్ కెనాల్ కాల్వను, మాణిక్ బండార్ చెరువు కాలువలను సర్వే చేయమని గత నెల తహసీల్దార్ కు వినతి పత్రం ఇచ్చిన చేయడం లేదన్నారు. పది సంవత్సరాల నుంచి అధికారులకు ఎన్నిసార్లు వినతులు అందజేసిన వినతులు చెత్తబుట్టలకే పరిమితం అయ్యాయని తెలిపారు. ఎంతమంది తహశీల్దార్లు మారిన సర్వే మాత్రం చేయడం లేదన్నారు. గత ఆరేళ్ల సంవత్సరం క్రితం కబ్జాఅయిన కాలువలను పరిశీలించి తహశీల్దార్లకు నివేదిక ఇస్తామని చెప్పి ఇప్పటివరకు సర్వే చేయలేదన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి పత్రాలు ఇచ్చిన అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే నిజాం సాగర్ కెనాల్ కాల్వను మాణిక్ బండార్ నవ్వ బండ మీదుగా బొంద్రి ఉన్న చెరువు కాలువలను సర్వే చేసి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై కలెక్టర్ స్పందించి ఇరిగేషన్ రెవెన్యూ అధికారులతో మాట్లాడి ప్రభుత్వ కాలువలను కాపాడాలని కోరారు. ప్రతి వర్షాకాలం 63వ జాతీయ రహదారిపై వర్షపు నీరు రోడ్డుపైనే నిలుస్తుందని, ప్రజలు ప్రయాణికులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సమస్య పరిష్కరించని ఎడల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అబ్బయ్య, సంజు, రాజేశ్వర్, భీమ్ సింగ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్

బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను తహసీల్దార్ గజానన్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈఓ రాజ గంగారాం బుధవారం తనిఖీ చేశారు. గతంలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా అధికారులు విద్యార్థులతో విద్యార్థుల తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనజ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వెంటనే కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పౌర సరఫరాల శాఖ (డి ఎస్ఓ) వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు, ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. వరి కోతలు నెల రోజుల నుండి ప్రారంభించిన జిల్లాలో రైతులు కోసిన పంట ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకొని ఎదురుచూస్తున్న ప్రభుత్వం మాత్రం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించలేదన్నారు. వర్షాలు పడి ధాన్యం తడుస్తుందని ఇంతవరకు కొనుగోలు చేస్తారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు, ఆకుల పాపయ్య, వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో అధిక సంఖ్యలో సన్న రకాలు వేసి తీరా పంట చేతికి వచ్చిన సమయంలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో తీవ్ర జాప్యం చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్ముకోవాల్సి వస్తుందని తెలిపారు. బోనస్ ఎగవేతకేనా ఈ జాప్యమని భూమయ్య ప్రశ్నించారు. రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా అమలుకాక, రైతు భరోసా అందక మరో దిక్కు, పరిహారం ఈ సీజన్ నుండైనా బోనస్ కూడా వస్తదో రాదో అని పరేషాన్‌లో రైతులు ఉన్నారని వారన్నారు. డిఎస్ఓ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని మేముంతా దానికోసమే ప్రయత్నం చేస్తున్నామని వారన్నారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గు ఎర్రన్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జేపీ గంగాధర్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు వాసరి సాయినాథ్ పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా ఉండాలంటే దోమలు పెరగనివ్వొద్దు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వ్యాధులను రాకుండా ఉండాలంటే దోమలను పెరగకుండా చూడాలని, ఇంటి చుట్టు పక్కల పరిశుభ్రత పాటించాలని డా. శంకర్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ ఆదేశాల మేరకు బుధవారం ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డిచ్ పల్లి మండలంలోని యానంపల్లి గ్రామంలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ పాల్గొని అవగాహన కల్పించారు. జాతీయ కీటక జనిత వ్యాధులైన దోమల ద్వారా సంభవించే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, లాంటి వ్యాధులను రాకుండా ఉండాలంటే దోమలను పెరగకుండా చూడాలని అన్నారు. ఇంటి చుట్టు పక్కల పరిశుభ్రత పాటించాలని సూచించారు. మంచినీటిలో నివసించే ఎడిస్ ఈజిప్టి అనే దోమవల్ల డెంగ్యూ వ్యాధి సోకుతుందని, కాబట్టి మంచినీటి కుండీలో లార్వా నిల్వ ఉండకుండా చూడాలని వివరించారు. ఆశా కార్యకర్తలు ప్రతి మంగళవారం, శుక్రవారం ఇంటింటికి తిరిగి డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటిలో గల పూలకుండీలు, వాడి పక్కన పెట్టిన కూలర్లు, వాడని రోలులో నీరు నిలువ ఉన్నట్లయితే లార్వా పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాంటి నీటిని తొలగించాలని, నీటి నిలువగల ప్రాంతాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదిక అందజేయాలని కోరారు. మురికి నీటిలో ఆడ అనాఫిలస్ దోమ నిలువ ఉంటుందని, ఇండి చుట్టు పక్కల మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని లేకుంటే మలేరియా సంభవించే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చరణ్ రాజ్, ఆరోగ్య సిబ్బంది గంగుబాయి, వెంకటరెడ్డి, ఆశా కార్యకర్తలు నిరోషా, మంజుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ

కమ్మర్‌పల్లి ఐటిఐలో 30వరకు స్పాట్ అడ్మిషన్లు

- ప్రిన్సిపాల్ కోటిరెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని తెలంగాణ ప్రభుత్వం ఉపాధి కల్పన శిక్షణ శాఖ, బాల్కొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఐటిఐ కమ్మర్‌పల్లి(బషీరాబాద్)లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో ఉన్న ఖాళీలకు ఈ నెల 30 వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపాల్ ఎం. కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 30 వరకు వాక్ ఇన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటిఐలో న్యూ ఏజ్ కోర్సులలో 172 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. సంవత్సర కాల వ్యవధితో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్లో 40సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ మరియు డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో 40సీట్లు, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్‌లో 20సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల కాలవ్యవధితో బేసిక్ డిజైన్యర్, వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్)లో 24సీట్లు, అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్‌లో 24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్‌లో 24సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా ప్రాంత వాసులు, పదవ తరగతి పాసైన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు 16 సంవత్సరాలు నిండిన వారు అర్హులని, అడ్మిషన్లకు వయోపరిమితులు లేదని తెలిపారు. కోర్సుల వివరాల కోసం, విద్యార్థులకు %ఎంఎ.కెట్.ఎక్స్‌మాస్.ఫ్రిజ్. ఋఋ% లో చూడాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్నవారికి ఈ నెల 30 వరకు ప్రతిరోజు బషీరాబాద్‌లోని ఐటిఐలో అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులు ఆన్ లైన్ అప్లికేషన్, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని రావాలని సూచించారు. వాక్ ఇన్ అడ్మిషన్స్‌లో ఎటువంటి రిజర్వేషన్లు వర్తించవని స్పష్టం చేశారు. పదవ తరగతి జీపీఏ మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఐటిఐ అడ్వాన్స్ కోర్సులు చదివిన విద్యార్థులకు మల్టీ నేషనల్ కంపెనీలో, ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు, విదేశీ ఉద్యోగ అవకాశాలు, ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. జీవితంలో త్వరగా స్థిరపడేందుకు, ఇతర దేశాలలో ఎందుకు ఈ సర్టిఫికెట్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమకు నచ్చిన వివిధ ట్రేడ్స్ సీట్లు పొందాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 8106794500, 9491566890 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

కల్లు శాంపిల్ సేకరించిన ఆబ్కారీ పోలీసులు

నవతెలంగాణ-దోమకొండ



శాంపిల్ సేకరిస్తున్న ఆబ్కారీ పోలీసులు

మండల కేంద్రంలోని ఆబ్కారి సీఐ మధుసూదన్ ఆధ్వర్యంలో కల్లు డిపో, వైన్స్‌లను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమకొండలోని కల్లు డిపో కేంద్రం వద్ద కల్లు శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. వైన్స్‌లలో మద్యం అమ్మకం నిర్వహణ, రికార్డులు పరిశీలించామని తెలిపారు. కల్తీ కల్లు విక్రయిస్తే చట్టపరమైన చర్యలుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌లు, సిబ్బంది ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్

మండలంలోని ఎక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునికి మాజీ సర్పంచ్ సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో 2 సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయులు కార్తీక్ విధులు నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దారని తెలిపారు. పాఠశాలకు విద్యార్థులకు ఎన్నో సేవలు అందించారని అన్నారు. బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయులకు ఎక్కపల్లి తాజా మాజీ సర్పంచ్ సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అఖిల్, కౌశిక్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ సాయిలు, అంగన్వాడీ టీచర్ లక్ష్మీనర్సమ్మ, మాజీ ఎస్ఎంసి చైర్మన్ కిష్టయ్య పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



కామారెడ్డి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ చంద్రశేఖర్‌రెడ్డి



దోమకొండలో..



భిక్కనూర్‌లో..

- పలు పోలీస్‌స్టేషన్లలో ఓపెన్‌హౌస్

నవతెలంగాణ-విలేకరుల బృందం

అమరవీరుల త్యాగాలు మరువలేనివని పలువురు ఎస్ఐలు అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలల్లో భాగంగా బుధవారం పలు పోలీస్‌స్టేషన్లలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసులు వాడే ఆయుధాలపై అవగాహన కల్పించారు.

కామారెడ్డి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పట్టణ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది పని విధానం, రిసెప్షన్ సెంటర్, లాకప్, రైటర్స్ రూమ్, వెపన్స్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన పిల్లల ప్లేయింగ్ జోన్‌లో విద్యార్థులు ఆడుకున్నారు.

దోమకొండ : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలల్లో భాగంగా జూనియర్ కళాశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ.. పోలీస్ విధుల నిర్వహణలో పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని తెలిపారు. పోలీస్ అమర వీరుల సంస్మరణలో భాగంగా పోలీస్‌ల విధుల నిర్వహణ, రికార్డులు, తుపాకీలు తదితర వాటిపై అవగాహన కల్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్రహ్మణ్యాచారి, పోలీస్‌లు, విద్యార్థులున్నారు.

భిక్కనూర్ : మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం పోలీసులు ఉపయోగించే ఆయుధాలను విద్యార్థులకు తెలియజేశారు. అలాగే నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెండవ ఎస్సై రామచంద్రనాయక్, పోలీస్ సిబ్బంది, పాఠశాల కరస్పాండెంట్ రేణు కుమార్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్‌డీ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో బుధవారం ఎన్.పీ.ఆర్.డీ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మహాసభల పోస్టర్లను జిల్లా అధ్యక్షులు గైని రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25, 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే వికలాంగుల హక్కుల తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలకు ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ముట్టినేని వీరయ్య, మురళీధరన్, జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్ హాజరవుతున్నారని అన్నారు. కావున వికలాంగులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామ్‌పటేల్, హరిప్రియ, జి.ఎల్లయ్య భీమ్‌రావ్, సోనీ, గంగారాం పటేల్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ గుర్తింపు కోసం కృషి చేయాలి

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు

నవతెలంగాణ-భిక్కనూర్



మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు

తెలంగాణ యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు కోసం కృషి చేయాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు తెలిపారు. బుధవారం మండలంలోని స్థానిక బిటిఎస్ చౌరస్తా వద్ద ఉన్న తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని దక్షిణ ప్రాంగణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీని అన్ని రకాలుగా అభివృద్ధి చెయ్యాలని, అదే లక్ష్యంతో అధ్యాపకులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం అధ్యాపకులు, అధికారులు కలిసి పనిచేయాలన్నారు. యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు వస్తే పెద్ద ఎత్తున నిధులు వస్తాయని, వచ్చే నిధులతో యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, హాస్టల్ వార్డెన్లు డాక్టర్ యాలాద్రి, డాక్టర్ సునీత, ఉమెన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ వైశాలి, ఏపీఆర్వో డాక్టర్ సరిత, అధ్యాపకులు డాక్టర్ లలిత, డాక్టర్ హరిత, డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ ప్రతిజ్ఞ, డాక్టర్ సబిత, డాక్టర్ నరసయ్య, డాక్టర్ రమాదేవి, డాక్టర్ నిరంజన్, డాక్టర్ శ్రీమాతా, శ్రీకాంత్, సునీల్ కనకయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేపర్‌మిల్లు గ్రామంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ ఉజుమా

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని పేపర్‌మిల్లు గ్రామంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గత రెండు రోజుల కిందట బోధన్ గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో అప్రమత్తమైన ఆరోగ్య సిబ్బంది బుధవారం గ్రామానికి చెట్టుపక్కల కుటుంబాలలో జ్వరాలు వచ్చిన వారిని గుర్తించి, వారికి రక్తనమూనాలను సేకరించడమే కాకుండా ఉచిత మందులను పంపిణీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ ఉజుమా, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కలపే రవీందర్, శ్రావణ్ కుమార్, గ్రామ కార్యదర్శి జక్కు భాస్కర్, రామకృష్ణ, ఇమ్రాన్, చిన్నయ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నుడా చెర్మన్ కేశ్ వేణును సన్మానించిన యువజన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి



కేశవేణుతో నాయకులు

మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు, నుడా చైర్మన్ కేశ వేణును కలిసి సన్మానించారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు యువకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు మరింత కృషి చేయాలని నుడా చైర్మన్ అన్నారు. నుడా చైర్మన్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ఇల్లెందుల రంజిత్ గౌడ్ (సన్నీ), రాందాస్, విష్ణువర్ధన్‌గౌడ్ తదితరులున్నారు.

సహకార సంఘాల ఉద్యోగులకు శిక్షణ పూర్తి

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ హైదరాబాద్ వారి సిటిసి హైదరాబాద్‌లో 8వ బ్యాచ్ డిసియం సిపి కోర్సు 2024 ముగింపు బుధవారం నాటికి శిక్షణ పూర్తి చేసుకున్నారు. నాబార్డు ఆధ్వర్యంలో ఐదు నెలలపాటు శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ భూక్య వెంకన్న ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. సహకార సంఘాల బ్యాంకు నిర్వహణ, ఆడిట్, సహకార సంఘాల బ్యాంకు సూత్రాలు, ఆర్థిక లావాదేవీలు తదితర అంశాల గురించి ఐదు నెలలపాటు శిక్షణలో వివరించారు. కామారెడ్డి జిల్లాలోని నల్లమడుగు, తాడ్వాయి, బీబీపేట్, మద్నూర్, తాండూర్, కిచ్చన్నపేట, శెట్పల్లి సంగారెడ్డి, ఎల్లారెడ్డి సహకార సంఘాల సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి

- తహశీల్దార్ విఠల్

నవతెలంగాణ-బోధన్



చెరువులో చేప పిల్లలను వేస్తున్న తహశీల్దార్ విఠల్

మత్స్యకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ తహశీల్దార్ విఠల్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణ పరిధిలోని పాండు చెరువు, చెక్కి తలాబ్, బతుకమ్మ చెరువులలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లల పంపిణీని గంగపుత్ర సొసైటీ సంఘాల వారీగా పంపిణీ చేశారు. పాండు చెరువు, చెక్కి తలాబ్ బతుకమ్మ కుంట చెరువులలో సుమారు 52వేల చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. అనంతరం బోధన్ మండలంలోని 7 గ్రామాల సొసైటీ సంఘాలకు చేప పిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో సంతోష్ కుమార్, ఆర్ఐ వరుణ్, బోధన్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కోట అబ్బయ్య, మాగిరి గంగాధర్, ఒంటి జడ భూమయ్య, నడిపి లక్ష్మయ్య, సుల్తాన్ సాయిలు, దాల్మిక శంకర్, వెండి లక్ష్మణ్, తోకల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మ బసవేశ్వరుని విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలో బుధవారం స్థానిక బసవేశ్వర చౌక్ వద్ద మహాత్మా బసవేశ్వర విగ్రహాన్ని పురపాలక చైర్మన్ పద్మ శ్రీకాంత్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పురపాలక చైర్మన్ పద్మ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మహాత్మా బసవేశ్వరుని ఆశిస్సులతో ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం అభివృద్ధి బాటలో నడవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని కళ్యాణి గేట్ వద్ద మహాత్మ బసవేశ్వరుని విగ్రహాన్ని కొన్ని నెలలుగా ఆవిష్కరించకుండా ఉండడంతో ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వీరశైవ లింగాయత్‌లు కలిసి బుధవారం వేద పండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం పురపాలక చైర్మన్ పద్మ శ్రీకాంత్ చేతుల మీదుగా బసవ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ పీఠాధిపతులు తదితర వీరశైవ లింగాయత్‌లు పాల్గొన్నారు.

డీఈవోను మర్యాదపూర్వకంగా కలిసిన టిఎస్పిటిఏ నూతన కార్యవర్గం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా డీఈవోను టిఎస్పిటిఏ నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దుబాసి నరేందర్, ప్రధాన కార్యదర్శి లింబాద్రి, గౌరవ అధ్యక్షులు అనిల్ కలిసి కామారెడ్డి జిల్లాలో ఉన్న డిప్యూటేషన్ విషయంలో చర్చించినట్టు నూతన అధ్యక్షులు నరేందర్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల బిల్లుల గురించి, స్కావెంజర్ నిధుల విడుదల విషయంలో రెండు రోజుల్లో నిధులు విడుదల అవుతాయని అందరూ స్కావెంజర్‌ను నియమించుకోవాలని సూచించారు. జిఓ నెంబర్ 25తో సంబంధం లేకుండా ప్రైమరీ పాఠశాలలో అవసరమున్న చోట ఖచ్చితంగా ఉపాధ్యాయులను నియమించి ప్రైమరీ పాఠశాలలను పరిరక్షించాలని తెలిపారు. దీనిపై డిఇఓ సానుకూలంగా స్పందిస్తూ ఎక్కడైతే విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉందో చెప్పాలన్నారు.

తాగునీటిపై గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. వారంకోమారు క్యాంపులను శుభ్రం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ హెచ్.శ్రీనివాస్, ఎంపీఓ రఫీ అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్‌సింగ్, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

వినయ్‌కుమార్ సస్పెన్షన్ ఎత్తివేత

నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వినయ్ కుమార్‌ను యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నట్లు మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ ఆదేశాల మేరకు ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్టు పేర్కొన్నారు. పార్టీలో యథావిధిగా కొనసాగుతాడని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిస గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

అయోడైజ్డ్ ఉప్పుపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ హిమబిందు, ఆశకార్యకర్తలు

నవతెలంగాణ-లింగంపేట్

అయోడైజ్డ్ ఉప్పు వాడకంపై బుధవారం ఇంటింటికి అవగాహన కల్పించారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశకార్యకర్తలు ప్రజలకు అయోడైజ్డ్ ఉప్పు వాడడం వలన కలిగే ప్రయోజనాలను వివరించినట్టు వైద్యాధికారి డాక్టర్ హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అయోడైజ్డ్ ఉప్పు వాడకపోవడం వల్ల గొంతు భాగంలో గ్రంథి ఉబ్బడం, జ్ఞాపకశక్తి తగ్గడం, చిన్న పిల్లల్లో చదువు మీద ఆసక్తి తగ్గడం, పెద్దవారిలో మరుగుజ్జుతనం, గర్భధారణ సమస్యలు, గర్భస్రావం, పిల్లలు అనారోగ్యంగా పుట్టడం లాంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. శారీరక వృద్ధి మందగించడంతో పాటు పిల్లలు వయసుకు తగినంతగా పెరగకపోవడం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు పూడ్చి వేయించిన మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఇందిరా గాంధీ స్టేడియంలో గల గుంతలను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పూడ్చి వేయించారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలోని ఎన్నో రోజుల నుంచి గుంతలు ఉండడంవల్ల క్రీడాకారులకు ఇబ్బందులు కలగడంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ వెంటనే మున్సిపల్ సిబ్బందితో వచ్చి దగ్గరుండి గుంతలను పూడ్చి వేయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పొతంగల్ పాఠశాల విద్యార్థులు ఎంపిక



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-గాంధారి

రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు పొతంగల్ కలాన్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు భావన, అక్షయ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగారావు తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి వచ్చే నెల 3 నుంచి 5 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారని కబడ్డీ శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, మాజీ సర్పంచ్ వడ్ల బాల్‌రాజు, గ్రామ పెద్దలు అభినందించారు. రాష్ట్రస్థాయిలో తమ సత్తా చాటి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా సూచించారు.

బోనాల్‌లో గాలికుంటు నివారణా టీకాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బోనాల గ్రామంలో మండల పశు వైద్య సిబ్బంది గ్రామంలోని పశువులకు గాలికుంటు నివారణా టీకాలు వేసినట్టు పశు వైద్యాధికారి అన్న జానస్ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో 38 గేదెలకు, 2 ఎద్దులకు, 4 ఆవులకు గాలికుంటు టీకాలు వేసినట్టు వివరించారు. గేదెలు, పశువు పెంపకందారులు కచ్చితంగా గాలికుంటు టీకాలు వేయించుకోవాలన్నారు. పశువులు గేదెలు రోగాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఎజాజ్, రమేష్ రైతులున్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం



శిక్షణ పొందిన సర్టిఫికెట్‌లతో మంచినీటి సహాయకులు

నవతెలంగాణ-వర్ని

గత నాలుగు రోజుల పాటు మంచినీటి సహాయకుల శిక్షణ బుధవారంతో పూర్తయిందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సాత్విక తెలిపారు. చందూర్, వర్ని, రుద్రూర్, మోస్రా మండలాల మంచి నీటి సహాయకులకు శిక్షణ పొందిన సర్టిఫికెట్‌లు కూడా అందజేసినట్లు వివరించారు. ఈ శిక్షణలో డిఈ మున్ని, సాత్విక, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మద్ది చంద్రకాంత్ రెడ్డి ఇటీవల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో బుధవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు మద్ది చంద్రకాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్ది చంద్రకాంత్‌రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను కలిసిన వారిలో భిక్కనూర్ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, లక్ష్మీదేవునిపల్లి మాజీ సర్పంచ్ రమేష్, జంగంపల్లి మాజీ సర్పంచ్ గుండా రాజు, బస్వాపూర్ మాజీ సర్పంచ్ తుడుం స్వామి, తిప్పాపూర్ మాజీ సర్పంచ్ రాజయ్య, బాగిర్తిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జంగం శ్రీశైలం, పెద్ద మల్లారెడ్డి మాజీ సర్పంచ్ అలుక భూమయ్య, తలమడ్ల మాజీ సర్పంచ్ కమలాకర్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్ 4
గురువారం | అక్టోబర్ 24, 2024 | www.navatelangana.com

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని అంకాపూర్ కోపరేటివ్ సొసైటీలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర మార్కెట్ చైర్మన్ మార గంగారెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కోపరేటివ్ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, గురడిరెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు అనంత్‌రెడ్డి, సీఈఓ శ్యామ్, సిబ్బంది, సొసైటీ డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
కాలేజీ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రుద్రూర్ విద్యార్థులు డాక్టర్ వెంకట్ రెడ్డి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో ప్రాక్టికల్స్ లో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలో చిన్ని కృష్ణ ప్రకృతి వ్యవసాయ క్షేత్రం గూపనపల్లి లో గల వరి పంట పొలాలను బుధవారం సందర్శించారు. .చిన్ని కృష్ణ ద్వారా విద్యార్థులు రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం చేసుకునే వివిధ రకాల పద్ధతులను తెలుసుకున్నారు. అలాగే వివిధ రకాల నాటు రకం వరి వంగడాల గురించి తెలుసుకున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-ఆర్మూర్
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనీ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ఆలూర్ మండలం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలను సందర్శించి పనితీరును పరిశీలించారు. ల్యాబోరేటరీలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న విధానాన్ని గమనించి, టెక్నీషియన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం స్థానికంగానే యంత్రాలను వినియోగిస్తుండడాన్ని గమనించిన కవ్యాప్తంగాతృప్తి వ్యక్తం చేశారు. ఇదే తరహాలో జిల్లా వ్యాప్తంగా అన్ని పీ.హెచ్.సీలలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తన వెంట ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నిర్ధారణ కోసం రాపిడ్ టెస్ట్ కిట్లు అందుబాటులో ఉన్నాయా అని పీ.హెచ్.సీ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి గది, ఓపి, ఇన్



మాట్లాడుతున్న కలెక్టర్

పేషంట్ వార్డులను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వాక్సిన్లను భద్రపరిచిన గదిని తనిఖీ చేసి, అవసరమైన ఔషధాలను శీతలీకరణలో ఉంచేందుకు ఫ్రిడ్జ్‌లను వినియోగిస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. పాము కాటుకు గురైన వారికి వైద్య సేవలలో వినియోగించే యాంటీ వీనమ్ మెడిసిన్, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ఆక్సిజన్ సిలిండర్లను ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. కాగా, దేగాం ఆరోగ్య కేంద్రానికి సుమారు ఐదెకరాల సువిశాల విస్తీర్ణం కలిగిన ఆవరణ పచ్చదనంతో కూడి ఉన్నప్పటికీ, ఎక్కడికక్కడ పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగిపోయి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల పరిసరాలను శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు వంటి సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టినప్పటికీ, అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ సమన్వయంతో పనిచేయాలి

● భీంగల్ ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి



మాట్లాడుతున్న ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
గ్రామాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని భీంగల్ ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు సూపర్వైజరి సప్లమెంటరీ ఫీడింగ్ కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ రాంబాబు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రశాంత్ ప్రొజెక్టర్ ద్వారా అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. అనంతరం భీంగల్ ఏసీడీపీఓ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ.. వయసుకు తగ్గ బరువు లేని పిల్లలు, అతి తీవ్ర లోప పోషణ పిల్లల్ని గుర్తించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్యశాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి పర్యవేక్షకురాలు గంగా హంస, ఏర్గట్ల పర్యవేక్షకురాలు సరస్వతి, హెల్త్ సూపర్వైజర్ స్వరూప, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబానికి అండగా బోధన్ ఎమ్మెల్యే



రత్నాకర్ మాతృమూర్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఇటీవల మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్ మాతృమూర్తిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అమ్మ ఈ వయసులో కూడ ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఆప్యాయతగా పలకరించి తన వాత్సల్యాన్ని పంచుతారని ఎమ్మెల్యే తెలిపారు. అమ్మతో, రత్నాకర్ కుటుంబంతో తమ అనుబంధం రెండు దశాబ్దాలది అన్నారు. వారి వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తాహెర్ బిన్ హందాన్, అరికెల నర్సారెడ్డి, గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం నిజామాబాద్ పోలీస్ పరేడ్ మైదానంలో ఉదయం 9 గంటలకు స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిజామాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్సా ఆంజనేయులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

సేవా కార్యక్రమాలే ధ్యేయంగా పనిచేస్తున్నాం

● రోటరీ క్లబ్ అధ్యక్షులు రజనీష్ కిరాడ్

నవతెలంగాణ-ఆర్మూర్
సేవ కార్యక్రమాలే ధ్యేయంగా పని చేస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్షులు రజనీష్ కిరాడ్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలతో పాటు, చదువులో ముందున్న విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. వృద్ధులకు, పలు రకాల ఇబ్బందులతో ఉన్న వారిని గుర్తించి రోటరీ ద్వారా సహాయం సహకారాలు అందిస్తున్నట్టు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరియైన వసతుల కల్పనకు కృషి చేస్తా

● ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి
అంగన్‌వాడీ కేంద్రాల్లో సరియైన వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని దాదాపు 59 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు సరిగ్గా లేవని తెలిపారు. గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించడం అంగన్‌వాడీల భద్యత అని గుర్తు చేశారు. మహిళా హక్కులు, పిల్లల హక్కులు కాపాడంలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వద్దనీ అన్నారు. అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ కాంగ్రెస్‌తోనే సాధ్యం

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
పదేళ్ల పాలించిన కెసిఆర్ ఒక్క ఉద్యోగాన్ని ఇవ్వని చేతగాని సీఎం అని మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అధికారం వచ్చిన కేవలం 9 నెలల్లోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ, వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్న ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గోనె రెడ్డి కళ్యాణ మండపంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మొదటగా అంతరెడ్డి రాజారెడ్డి, హాజరైన బోధన్ ఎమ్మెల్యేకు అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం రాజారెడ్డితో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, పదేళ్లపాటు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో ఒక్క ఉద్యోగాన్ని భర్తీ చేయకపోగా నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో



బాధ్యతలు స్వీకరిస్తున్న గ్రంథాలయ చైర్మన్

విఫలమయ్యారని విమర్శించారు. నీళ్లు నిధులు నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క ఉద్యోగాన్ని కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. అనంతరం పలువురు నూతన గ్రంథాలయ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్తాహెర్బిన్ హంధాన్, నూడా చైర్మన్ కేశ వేణు, సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, గడుగు గంగాధర్, అరికెల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సన్మానం



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన ఆలూర్ మండల కేంద్రానికి చెందిన కళ్లెం మల్లారెడ్డి (వైయస్) బుధవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆలూరు శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయపరంగా ముందున్న ఆలూరు గ్రామానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో తగిన ప్రాధాన్యత కల్పించారన్నారు. మల్లారెడ్డి డైరెక్టర్‌గా నియామకానికి కృషి చేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వినయ్ రెడ్డి ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా నియమితులైన సభ్యులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, మార్కెట్ యార్డులో పంటల క్రయవిక్రయాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పెండ ఉదయ్, సీనియర్ నాయకులు వెల్మ గంగారెడ్డి, బాద్గుణ నర్సారెడ్డి, కుంట భోజన్న, ఇస్సపల్లి నారాయణ, లాడే అనిల్, దండు బీరయ్య, మామిడి రాజారెడ్డి, కండెల నవీన్, తోక మల్లయ్య, నూనె సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



విద్యార్థులతో ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోత్ రఘురాం అన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద విద్యార్థులతో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయలేదు. గత మూడు సంవత్సరాల నుంచి ఫీజుబకాయిలు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు బంద్ చేశారన్నారు. ప్రభుత్వం ఇప్పటికి స్పందించకుండా మౌనంగా ఉండడం సరికాదన్నారు. ప్రభుత్వం డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి వారికి రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంపై హామీ ఇచ్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదల అయ్యే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నగర సహాయ కార్యదర్శి నవీన్ కృష్ణ, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానించిన కుటుంబీకులు



గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానించిన కుటుంబీకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డిని ఆయన కుటుంబ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. అంతరెడ్డి రాజిరెడ్డి నిజామాబాద్ గ్రంథాలయ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

28న మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభ

● ఎంఎస్‌పి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సరికెల పోశెట్టి

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఈ నెల 28న మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభ కామారెడ్డిలో నిర్వహిస్తున్నట్టు ఎంఎస్‌పి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సరికెల పోశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అన్ని అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సరికెల పోశెట్టి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 25 నుంచి 30 వరకు మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నవంబర్ 4 నుంచి 14 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గ కేంద్రాల్లో అన్ని మండల కేంద్రాల్లో మాదిగల ధర్మ యుద్ధ దీక్షలు, నవంబర్ 16న దండోరా ధర్మ యుద్ధ రథయాత్ర కోదాడ నుంచి మొదలవుతుందన్నారు. అలాగే డిసెంబర్ 21న చలో హైదరాబాద్ మాదిగల ధర్మయుద్ధ మహాప్రదర్శన నిర్వహించబోతున్నామని తెలిపారు. ఎస్సీ



మాట్లాడుతున్న ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు సరికెల పోశెట్టి

రిజర్వేషన్ల వర్గీకరణ రాష్ట్రంలో అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 28న ఉమ్మడి జిల్లా మాదిగల ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ధర్మయుద్ధ ఉమ్మడి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపధ్యక్షులు రోడ ప్రవీణ్, ఎంఎస్పి జిల్లా నాయకులు యాదశ్రీ రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆకారం రమేష్, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు పెద్దగారి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి

● బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (బిఎల్‌టీయూ)

నవతెలంగాణ-కంఠేశ్వర్
మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మిక, ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (బిఎల్‌టియు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శంకర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ వాటర్ సప్లై, స్ట్రీట్ లైట్స్, ఫిల్టర్ బెడ్స్, గార్డెన్స్, శానిటేషన్ డ్రైవర్స్, శానిటేషన్ కార్మికులు, జవాన్‌లు, తదితర సెక్షన్ల ఔట్ సోర్సింగ్ కార్మిక ఉద్యోగులు శ్రమ దోపిడికి గురవుతూన్నారని ఆయన ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఔట్ సోర్సింగ్ కార్మిక ఉద్యోగులకు యాభై లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షురాలు సబ్బని లత, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, వాటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కొమ్ము రాహుల్, కార్యదర్శులుఖ అయిబూటి హరిష్, బిఎల్‌టీయూ జిల్లా నాయకులు, డ్రైవర్స్, కార్యదర్శి పి.నవీన్, ఎం.ఎల్లయ్య, కార్మికులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న దండి వెంకట్

రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మొద్దు

● మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

నవతెలంగాణ-భీంగల్ రూరల్
రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మొద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. బుధవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేంగల్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులకు అమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొదిరే స్వామి మాట్లాడుతూ.. రైతులు దళారులకు ధాన్యం అమ్మకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహిపాల్ జీవన్. చెంగల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | అక్టోబర్ 24, 2024 | www.navatelangana.com

సీఈఐఆర్ ద్వారా ఫోన్‌లు రికవరీ

- పోగొట్టుకున్న బాధితులకు అప్పగింత



నవతెలంగాణ-కామారెడ్డి

దేవునిపల్లి పోలీస్ స్టేషన్లో దరఖాస్తు చేసుకున్న వారి ఫోన్లను సీఈఐఆర్ యాప్ ద్వారా పట్టుకుని బాధితులకు అందజేసినట్టు ఎస్సై రాజు తెలిపారు. మొబైల్ పోగొట్టుకున్న వారిలో ఏటి సాయన్న, అట్ల మనోహర్, వడ్డే నరేందర్, ఎల్లం గోసంగి, రజాక్, ప్రేమ్‌దాస్, సవరవరం పాండు, రమేష్ తదితరులున్నారు. ఇప్పటివరకు సిఈఐఆర్ యాప్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌లను 120 రికవరీ చేసి వాటి యజమానులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఎంబిబిఎస్ సీట్లు సాధించిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు





నవతెలంగాణ - భీంగల్ రూరల్

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు ఎంబిబిఎస్ సీట్లను సాధించారు. హీనా సహీర్, హైదరాబాద్ లోని గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించగా, అరేబియా మీర్జాకు జగిత్యాల్ లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లను సాధించినట్లు ప్రిన్సిపల్ చిరంజీవి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి మెడికల్ సీట్లను సాధించి ప్రైవేట్ కాలేజీలకు ధీటుగా గట్టి పోటీని ఇచ్చినందుకు, అలాగే ఆ కళాశాలకు పేరు తెచ్చిన ఇరువురు విద్యార్థినులకు ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

చేప పిల్లలు ఎక్కడ..?

- టెండర్లలో జాప్యం
- ఉపాధికి ఎసరు
- నాసిరకం చేపపిల్లలు
- నష్టాల్లో మత్స్యకారులు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారుల ఉపాధికి భరోసా కల్పించేది. 2016లో ఉచిత చేప విత్తనం పంపిణీ పథకం ప్రారంభం కాగా గతేడాది వరకు ఎనిమిదిసార్లు అందజేశారు. ప్రతీ ఏడాది మే, జూన్ వరకు టెండర్లను పూర్తి చేసి ఆగస్టులోగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపలను వదిలేవారు. ఈ ఏడాది ఇప్పటి వరకు చేపపిల్లలను పంపిణీ చేయకపోవడంతో గంగపుత్రులు గాబరా పడుతున్నారు. చేప పిల్లల పంపిణీకి అదను దాటిపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు కసరత్తు చేస్తున్నారు. అధికారుల నిర్ణయంపై మత్స్యకారులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో మత్స్యకారులను ఆదుకునేందుకై ఎమ్మెల్యే పోచారం కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువులో చేప విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టగా అందులో నాసిరకం చేప పిల్లలు ఉండడంతో తిరిగి పంపించేశారు.

బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటికీ చేప పిల్లల పంపిణీ కాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. బాన్సువాడ మండలంలో పరిదిలో ఇరిగేషన్ శాఖ పరిదిలో 17 మేజర్ చెరువులు, గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 12 చెరువులు, బీర్కూర్ మండలంలో ఇరిగేషన్ శాఖ పరిదిలో 9 చెరువులు ఉండగా గ్రామ పంచాయతీ పరిధిలో 19 చెరువులు, నసురుల్లాబాద్ మండలంలో ఇరిగేషన్ శాఖ పరిదిలో 8 మేజర్ చెరువులు, గ్రామ పంచాయతీ పరిధిలో 12 చెరువులు ఉన్నాయి. అలాగే బాన్సువాడ మండలంలో 13 సొసైటీలకు గాను 811 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. అలాగే బీర్కూర్ మండలంలో ఆరు సొసైటీలకు గాను 497 మంది మత్స్యకారులు ఉన్నారు. నసురుల్లాబాద్ మండలంలో 8 సొసైటీలకు గాను 257 మంది మత్స్యకారులు సభ్యులుగా కొనసాగుతున్నారు. సభ్యులే కాకుండా ఇతర మత్స్యకారులు ఉన్నారు. చెరువుల్లో చేపలు ఉంటేనే వీరికి ఉపాధి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేప పిల్లలు పంపిణీ చేయకపోవడంతో వచ్చే సంవత్సరం ఉపాధికే ఎసరు వచ్చే అవకాశం ఉందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

టెండర్లలో జాప్యం.. ఉపాధికి ఎసరు..

జిల్లా వ్యాప్తంగా మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. వీరికి ఉపాధి కల్పించేందుకు సుమారు 6కోట్ల చేప పిల్లలను జిల్లా వ్యాప్తంగా ఉన్న జలాశయాల్లో వదిలేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. టెండర్లలో నెలకొన్న జాప్యం కారణంగా ఈ యేడు చేపపిల్లల విడుదలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. గతేడాది సరఫరా చేసిన చేపపిల్లల విత్తనాల పంపిణీకి సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల కాకపోవడంతో ఈసారి ఆన్‌లైన్ టెండర్లు పాల్గొనేందుకు అంతగా ఆసక్తి కనబరచలేదు. ఎన్నిసార్లు నిర్వహించిన టెండర్లు ఖరారు కాలేదు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని బాన్సువాడ మండలంలో చేప పిల్లల పంపిణీ నిలిచిపోయింది. ఆగస్టు మాసంలో వదిలే చేప విత్తనం అక్టోబరు మూడో వారం వరకు సరఫరా చేయకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం మరోమారు టెండర్లను పిలవడానికి ప్రభుత్వానికి సమయం చాలకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మత్స్యకారులకు ఉపాధి కల్పనలో భాగంగా చేప పిల్లల విత్తనాలను సరఫరా చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.



25న చలో హైదరాబాద్

- విజయవంతం చేయాలి
- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజనర్సు



మాట్లాడుతున్న రాజనర్సు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం విస్మరించడంతో ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమానికి తలపెట్టామని సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజనర్సు అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మున్సిపల్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని, కనీస వేతనం రూ.26,000 చెల్లిస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్మికులంతా ఏకమై ఈనెల 25న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ కార్మికులు చంద్రయ్య, వెంకన్న, వేణుగౌడ్, విజయేందర్, కిషన్, మొగులయ్య, మహేందర్, లక్ష్మణ్, సాయిబాబా, సిద్దు, శంకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్



పోలీసుల పనివిధానం, ఆయుధాల గురించి వివరిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-లింగంపేట్

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ బుధవారం నిర్వహించినట్టు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో పనివిధానం, రిసెప్షన్ సెంటర్, లాకప్, ఆయుధాలపై వినియోగంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రకాష్, కానిస్టేబుల్, విద్యార్థులు ఉన్నారు.

నాటుతున్నరు.. నరుకుతున్నరు..

- లక్ష్యంకోసం మొక్కలు నాటుతున్నరు
- విద్యుత్ వైర్లకు అడ్డొస్తున్నాయని నరికేస్తున్నరు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వం ప్రజలకోసం ప్రజల ఆరోగ్య రిత్యా ఎన్నో విధాలుగా బాధ్యతలు తీసుకొని, 'ప్రభుత్వాలు మొక్కలు నాటండి కాలుష్యాన్ని నివారించండి..' అనే నినాదంతో ఓవైపు ప్రచారం చేస్తూనే మొక్కలు నాటుతున్నారు. ఆ మొక్కలను నాటే సమయంలో అవి ఎంత ఎత్తుకు పెరుగుతాయి... అవి పెరగడంవల్ల పరిసర ప్రాంతాలకు ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా... ఇబ్బందులు కలిగితే తరువాత రోజుల్లో ఎటువంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది... అనే అంశాలను ఆలోచించకుండానే మొక్కలను నాటుతున్నారు. ఆ మొక్కలు పెద్దగా అయిన తర్వాత విద్యుత్ వైర్లకు తగులుతున్నాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, గాలివాన వచ్చినప్పుడు, విపరీతమైన గాలి దుమారం లేచినప్పుడు ఈ చెట్ల కొమ్మలతో వైర్లు తెగిపోయే ప్రమాదం ఉందని విద్యుత్ శాఖ ఉద్యోగులు చెట్ల కొమ్మలనే కాకుండా... చెట్లను కాండం వరకు తొలగిస్తున్నారు.

ఓవైపు... ప్రభుత్వం డబ్బులను వెచ్చించి మొక్కలను నాటుతుంటే..., మరోవైపు ప్రభుత్వ అధికారులే మొక్కలను తొలగిస్తున్నారు. ఆ మొక్కలను నాటే సమయంలోనే... ఎటువంటి స్థలంలో మొక్కలను నాటితే ఏపుగా పెరుగుతాయి అనేవి ముందుగానే ఆలోచిస్తే బాగుంటుందని ప్రజలు అంటున్నారు. ఒక్కోమొక్క ఎంతో మందికి స్వచ్ఛమైన గాలి అందిస్తుంది. తద్వారా కాలుష్యం నివారణ కూడా జరుగుతుంది. మొక్కలు నాటడం .. చెట్లుగా పెరిగిన తరువాత కొట్టేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు మొక్కలు నాటే సమయంలో అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. చెట్లను కనీసం కొమ్మలవరకే తొలగించాలని సూచిస్తున్నారు. ఇప్పుడు ఈ ఫోటోలో కనబడుతున్న దృశ్యం... జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ కి చెందిన ఒక పోల్ నుండి ఇంకో పోల్‌కు మధ్యలో నాలుగైదు చెట్లను నరికి వేశారు. అలా 4 విద్యుత్ పోల్‌ల మధ్య 16 చెట్లను నరికి వేశారు. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షణ చేస్తూ సక్రమంగా మొక్కలు నాటాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



కొట్టేసిన చెట్లు



చెట్టుమొత్తం నరికేయడంతో మిగిలిన కాండం

పశువుల నీటితొట్టి శుభ్రం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సందీప్ కుమార్ పనితీరుపై గ్రామంలోని రథంగల్లి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పశువుల నీటితొట్టిని 15 రోజులకు ఓసారి పంచాయతీ పారిశుధ్య కార్మికుల ద్వారా శుభ్రం చేయిస్తున్నారు. దీంతో గ్రామ కార్యదర్శి పనితీరుపై రథంగల్లీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నీటితొట్టిని శుభ్రంచేస్తున్న కార్మికులు

యువతి అదృశ్యం.. కేసు నమోదు



నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రానికి చెందిన దొనకంటి అర్చన అనే యువతి బుధవారం ఉదయం తన ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని భర్త దొరకంటి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఆమె బయటకు వెళ్లే ముందు బ్లూ కలర్ చీర కట్టుకుని ఉందన్నారు. ఫిర్యాదులో ఆమె భర్త గంగాధర్ పేర్కొన్నట్టు చెప్పారు.

జాతీయ ఎస్టీ సభ్యుడిని సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని ఏక లవ్య మోడల్ పాఠశాలను బుధవారం జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు ఇజటీత్ హుస్సేన్ నాయక్ సందర్శించారు. తెలంగాణ యూనివర్సిటీ ఎస్సీ ఎస్టీ యునియన్ సభ్యులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలు వినవించు కున్నారు. తమ సమస్యల పరిష్కారంకోసం త్వరలో యూనివర్సిటీని సందర్శిస్తానని వారికి హమీ ఇచ్చారు. అంతకు ముందు జాకత్ హుస్సేన్ నాయక్ ను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ ఎస్సీ,ఎస్టీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు పని తీరు మార్చుకోవాలి

- మరోసారి పర్యటిస్తా.. సమస్యలు పరిష్కారం కావాలి
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్టీ కమిషన్ సభ్యులు



భోజనం చేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గురుకుల పాఠశాలలోని వసతులు సరిగ్గా లేవని అధికారులపై నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యులు జఠోత్ హుస్సేన్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఇందల్ వాయి మండలంలోని గంగారం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మాక్లూర్ తండా వద్ద ఉన్న ఎకలవ్య పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని టాయిలెట్లను, వంటశాల, హాస్టల్ వసతితో పాటు ఇతర గదులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల 2017లో ప్రారంభమై ఇప్పటి వరకు విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ రూమ్లు లేవని, బాత్రూమ్లలో సరైన సదుపాయాలు లేవని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక వనరులు కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన ఎందుకు వినియోగించు కోవటం లేదని అధికారులను ప్రశ్నించారు. విద్యార్థులకు కావల్సిన అన్ని వసతులను ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో మరోసారి పాఠశాలను సందర్శిస్తానని, ఆ సమయంలో లేని పక్షంలో అధికారులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకరావలన్నారు. విద్యార్థులకు వారాని కొకసారి డ్యాన్స్ క్లాసెస్, మూవితో పాటు స్పోర్ట్స్ కూడా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ అంకిత్, డీటీడీఓ నాగోరావు, రజిత, ఆర్సీఓ గంగారాంనాయక్, డీసీఓ సోమనాయక్, తహసీల్దార్ వెంకట్రావు, ఎంపీడీఓ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ తోపాటు అరి మోహన్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా చార్జీలు, సబ్సిడీపైన సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టిజీ ఈఆర్ సి) వారు నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టి.జి.ఎన్.పి.డి.సి.ఎల్) ప్రతిపాదించిన 5వ నియంత్రణ కాలానికి 2024-25 సంవత్సరం నుంచి 2028-29 సంవత్సరం వరకు డిస్ట్రిబ్యూషన్ వ్యాపారము సమగ్ర ఆదాయ ఆవశ్యకత, వీలింగ్ చార్జీలు, 5వ నియంత్రణ కాలానికి (ఎఫ్‌వై2024-25 నుండి ఎఫ్‌వై 2028-29 నుండి వరకు) రిటైల్ సప్లయి వ్యాపారం సమగ్ర ఆదాయ ఆవశ్యకత, ఆర్థిక సంవత్సరం 2024-25కి రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడి సర్‌చార్జిలపై ఈనెల 24న బహిరంగ విచారణ నిర్వహిస్తున్నటుట టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆర్ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం, కలెక్టరేట్‌లో సమయం ఉదయం 10:30గం.లకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యుత్ వినియోగదారులందరు హాజరు కావాలని కోరారు.

ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయొద్దు

- ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ అంకం భానుప్రియ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయొద్దని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ అంకం భానుప్రియ అన్నారు. నిజామాబాద్ నగరంలోని పాలి టెక్నిక్ కళాశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ అంకం భానుప్రియ మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ పనికిరాదన్నారు. అనారోగ్యం కలిగితే సొంత వైద్యం చేసుకోకుండా డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. మహిళలను రక్తహీనత సమస్య వేదిస్తుందని, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చని సూచించారు. క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినిల సందేహాలకు డాక్టర్ భానుప్రియ నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నరేష్, లయన్స్ జోన్ చైర్మెన్ జిల్కర్ విజయానంద్, ఉపాధ్యక్షులు పోలాస సత్యనారాయణ, కార్యదర్శి రవీంద్రనాథ్ గుప్త, కోశాధికారి రాఘవేంద్ర బాబు, పూర్వాధ్యక్షులు గంగాదాస్, పాలిటెక్నిక్ కళాశాల అలుమ్ని అధ్యక్షుడు బాల్ నర్సయ్య,లెక్చరర్ భారతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ భానుప్రియ

ఓడినవారు గెలుపుకోసం ప్రయత్నించాలి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట గ్రామ శివారులో గల పోలీస్ శిక్షణ కేంద్రంలో ఎస్టీటీపీసీల స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి బుధవారం అదనపు పోలీస్ కమిషనర్ కోటేశ్వరరావు హాజరై ప్రసంగించారు ఈ సందర్భంగా పోలీస్ క్రీడలు నిర్వహించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు క్రీడల్లో విజయాలు సాధించిన వారికి బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా క్రీడలలో ఓడిన వారు నిరుత్సాహ పడకుండా గెలుపు కోసం ప్రయత్నించాలని అన్నారు. కార్యక్రమంలో సిటిసి ఏసిపి మస్తాన్ అలీ ఏఆర్ ఎసిపి నాగయ్య బోధన్ ఎసిపి శ్రీనివాస్ సిఐ శివరాం ఆర్ఐ శ్రీపాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.



కప్‌ను అందుకుంటున్న క్రీడాకారులు

గుండె ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే వేముల భరోసా



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - భీంగల్ రూరల్

మండలంలోని బడా భీంగల్ గ్రామానికి చెందిన గంగామణి హార్ట్ సర్జరీ అవసరమై నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స కోసం చేరడంతో ఈ విషయం స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి మెరుగైన చికిత్స కోసం రూ. 1.25 లక్షల రూపాయల ఎల్వోసి మంజూరు చేయించి ఎల్ఓసీ కాపీని వారి కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో అందజేశారు. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేములకు కృతజ్ఞతలు తెలిపారు.